మజిలీ

సాయంత్రం ఐదు దాటింది.

నే వెళ్ళేసరికి రజని వొక్కతే వుంది ఇంట్లో. మధ్యహాల్లో ఉయ్యాలబల్ల మీద కూర్చుని ఊగుతోంది. మధ్యమధ్య కాళ్ళని నేలకేసి తాటిస్తూ - ధ్యాసని తాను చదువుతున్న ఏదో తమిళ పత్రికలో నిమగ్నం చేసింది.

మొహం ఎత్తి "కూర్చో" అంది. బల్లమీద ప్రక్కకి జరిగింది. కూచున్నాను.

ఉయ్యాల నిమ్మళంగా ఊగుతోంది. కిటికీలోనుంచి చల్లగా గాలి వీస్తోంది.

కాలి ఊతంతో ఉయ్యాలని ఆపి, నా కళ్ళలోకి చూసింది. "ఈ కవిత చూడు ఎంత అద్భుతంగావుందో! గ్లాసు ఖాళీ అయినా తాగేస్తున్నానంటాడు. ఏదో ఉర్దూ కవితల అనువాదం పడింది."

నేను సన్నగా నవ్వేను. ఆ కవిత జగర్‌ది – నాకు తెలుసు. ఆ పాదానికి ముందున్న పాదమూ తెలుసు.

ఆమె పుస్తకాన్ని ప్రక్కన పెట్టింది. "చెప్పు" అంది.

"నేను రేపు రాత్రి బయలుదేరుతున్నాను –" చెప్పేను.

ఒకసారి మౌనంగా నా కళ్ళలోకి చూసి చూపులు మరల్చుకుంది.

"కావాలని తెప్పించుకొన్న బదిలీ. వెళ్ళక ఏంచేస్తావ్?" నిష్ఠూరం!

మా ఇద్దరిమధ్య ఏకవచన సంబోధనలే అలవాటయినై మొదట్నుంచీ.

"నువ్వేలాగన్నా అనుకో. బదిలీ వచ్చింది. వెళ్ళక తప్పదుగా," కొంచెం బాధగానే అన్నాను.

ఉన్నట్టుండి నా ఎడమ అరచేతిని తన కుడి అరచేతిలోకి తీసుకుని నొక్కింది. ఆమె పరిస్థితి ఉద్విగ్నంగా వుంది. గమనించాను. కళ్ళనిండా నీళ్ళు! ఇది నాకు హఠాత్తుగా ఎదురైన సంఘటం! నిలవొక్కుకున్నాను.

"ఛ ... ఛ ... ఏవిటిది – పసిపిల్లలా" అన్నాను, అనునయింపుగా.

"అవును. నువ్ నన్ను నలభై ఏళ్ళ పసి పిల్లను చేశావు" అంది. ముక్కుపుటాలెగరేస్తునే గలగలా నవ్వింది. నుదురు ధగధగమంది. నా కాళ్ళవేపు తల ఆనించి పడుకుంది.

గోడకు వ్రేలాడుతున్న 'మొనాలిసా' నవ్వుతోంది. ప్రక్కగా ఫ్రేమ్‌లో ఏదో 'లేండ్ స్కేప్', కొండల్లోనుంచీ దుమికి గలగల పారుతూ మైదానాల్లోకి ప్రవేశిస్తోంది సెలయేరు.

నా కళ్ళలోకి చూస్తూ అంది రజని, "ఏమన్నా కబుర్లు చెప్పు"

"ఇన్నాళ్లూ నీ మాటల కాపీనంతో. చాల వాక్యాలు బాంక్‌లో వేసి ఉంటావ్. నువ్వే విత్‌డ్రా చేయాలి." అన్నాను.

సన్నగా నవ్వింది. "నాటీ" అంది. కళ్ళు చికిలించింది. "మళ్ళీ ఎన్నాళ్ళకో మనం కలుసుకోవడం" నిర్వేదంగా అని శూన్యంలోకి చూడసాగింది.

"అసలు కలుసుకుంటామని గ్యారంటీ ఏం వుంది ?" ఎందుకనో ఠక్కున అన్నాను. వెంటనే నాలుక కరుచుకున్నాను.

ఉలిక్కిపడ్డట్టు లేచి కూర్చుంది రజని. బుంగమూతి పెట్టింది. "అంతేనన్నమాట." అంటూ చరాల్న ఉయ్యాల దిగి విసవిసా వంటగదిలోకి వెళ్ళింది.

గడియారం ఆరు కొట్టింది. లేచి లైటు వేశాను.

కుర్చీలో కూర్చున్నాను.

అనవసరంగా రజని మనసు నొప్పించా వనిపించింది. ఆమె బేలతనం తెలుసు కనుక నొచ్చుకున్నాను.

నా ఆలోచన ఒక్కసారిగా వెనక్కు నడిచింది.

మూడేళ్ళ క్రితం బదిలీమీద ఈవూరొచ్చాను. రజనితో పరిచయమైంది. ఆమె మా సంస్థలోనే వేరే డిపార్ట్‌మెంట్‌లో ఆఫీసరు. వయస్సులో నాకంటే మూడేళ్ళు పెద్ద. త్వరలోనే మేము మంచి మిత్రులమయ్యాం. దీనికి కారణం - ఆమె డిపార్ట్‌మెంట్‌కి నేను నా విధి నిర్వహణకోసం అతి తరచుగా వెళ్ళి రావలసిన పరిస్థితి వుండటమే. ఆమె కొంచమే మాట్లాడేది. కానీ ఆ వ్యక్తిత్వంలో ఒక గాంభీర్యం, ఒక ఆకర్షణ నన్ను ఆమెకు సన్నిహితుణ్ణి చేసినై. పరస్పరం గౌరవించుకోగల వివేకం విచక్షణా ఆ మైత్రిని మరింత ఉదాత్తం చేశాయని నా వుద్దేశ్యం.

రెండేళ్ళ క్రితం -

రజని భర్త ఆనందం హఠాత్తుగా గుండె పోటుతో మరణించాడు. ఆమె ఆ దుర్ఘటననుంచీ తేరుకోవడానికి నా సహాయసహకారాలూ, మాట సాయమూ కారణమని - ఆమె ఆమె కొడుకు ప్రభాకర్, ఆమె 'మామి' - విశాలాక్షి చాలాసార్లు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ చెప్పుకున్నారు. మా ఆఫీసులో చాలామంది నన్ను మెచ్చుకున్నారు. రజనిపట్ల ఉద్యోగుల్లో ఎనలేని గౌరవభావం వుండటాన, ఆమెతో సాన్నిహిత్యాన్ని పొందిన నాపట్ల కూడా వారికి ఏకవిధమైన గౌరవం, అభిమానం కలిగినై.

నేను తరచూ వాళ్ళింటికి వెళ్ళేవాణ్ణి. అప్పుడప్పుడు రజనీ ప్రభాకర్ మా ఇంటికి వచ్చేవాళ్ళు. నా భార్య శారద కూడా

వాళ్లతో చాల కలుపుగోలుగా వుండేది. నలుగురం కలిసి వొకటి రెండుసార్లు కారు మాట్లాడుకుని పిక్‌నిక్‌లకి వెళ్ళేము.

ప్రభాకర్ ఇంటర్ కాగానే ఇంజనీరింగ్‌లో చేర్తానన్నాడు. కొడుకు తనకు దూరంగా ఎక్కడో వుండటం ఇష్టంలేదు, రజనికి. అతన్ని విడిచి వుండలేనంది. నేనే చెప్పి వొప్పించాను. తండ్రిలా అతన్ని ఇంజనీర్‌ని కానిమ్మని నచ్చచెప్పాను.

ప్రభాకర్ మాండ్యా వెళ్ళాడు.

నాలుగు నెలలు గడిచినై.

రజనికి జ్వరం వచ్చింది. వచ్చిన జ్వరం ఏ వైద్యానికీ లొంగలేదు. శారద వూళ్లో లేదు – పుట్టింటికి వెళ్లింది. 'మామి' చాల కలత పడింది. ఆమె దిగులుకు అంతేలేదు. నేనే ఇద్దరికీ ధైర్యం చెప్పాల్సివచ్చింది. వారం తిరిగేసరికి - రజనికి పొంగు బయట పడింది. ఆ తర్వాత పదిహేను రోజులు మశూచితో పెద్ద యుద్ధమే జరిపింది రజని. ఆమె పరిచర్యలు నిజానికి నన్నూ సగం చేసినై.

ఒకసారి –

ఇద్దరమూ లాన్‌లో కూర్చున్నాము. రజని మల్లెపూలు కట్తోంది. అవును తాను భర్త పోయినా - పువ్వులు ముడవడం, బొట్టు కాటుక దిద్దడం, గాజులూ సొమ్ములూ వేసుకోవడం మాన లేదు.

ఆమె అన్నది. "నీ సాన్నిహిత్యంలో నేను పునర్జన్మె ఎత్తాను. నీ పరిచర్యలకీ ఆదరణకీ నేను నీకు అజన్మాంతరం ఋణపడి వుండాలి."

రజని కృతజ్ఞతకి నా మనస్సు ఆనందంతో గంతులు వేసింది. తాదాత్మ్యంతో ఆమెకేసి పరీక్షగా చూసేను.

రెండు లక్షలకు అధికారిణి. నా కంటే పెద్దదే అయినా ఐదారేళ్లు చిన్నదిగా కనిపించే శరీర సౌష్టవం. నవలా నాయికల అందగత్తె. గౌరవప్రదమైన ఉద్యోగిని.

రజని నాకు అమృతంలా భాసించిన భావన ! బహుశా దీనికి కారణం - నాకు అందమైన వాటిని ఆరాధించే దృష్టి వుండటమేనేమో ! బంగారానికి తావి అబ్బినట్లు అందానికీ ఉదాత్తతని ప్రసాదించిన విలక్షణమైన ఆమె వ్యక్తిత్వం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ఆదర్శవంతమైన పాత్రకు రూపకల్పన జరిగితే రజనిగా నిలుస్తుందనిపించేది నాకు. నా కలలకూ, ఆలోచనలకూ మూర్తిగా దర్శనమిచ్చేది - రజని. భావయుక్తమైన రాగంలా, అర్థవంతమైన కవితలా ; నా భావనలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంది - రజని !

ఆలోచనల నుంచీ తేరుకున్నాను. ఎదురుగా రజని ఏదో మాట్లాడుతూ టీపాయ్ మీద ప్లేట్లు సర్దుతోంది. చూశాను. రెండు శాండ్‌విచ్‌లూ రెండు కప్పుల ఐస్‌క్రీము. "తీసుకో" అంటూ ఎదురు కుర్చీలో కూర్చుంది.

నేను ఆమెకేసి తేరసార చూశాను. చెక్కిళ్ళమీద ఏడుపు చారలు ! నిప్పు కణికల్ని ఏరుతున్నట్లయింది నా పరిస్థితి.

శాండ్‌విచ్‌లూ, ఐస్‌క్రీమూ - నాకు ప్రాణం. అయినా తినలేకపోయాను.

మామీ వచ్చింది - చేతుల్లో సంచీలూ, బుట్టలూ. కూరలూ, పళ్లూ, ఇతర వస్తువులూ తెచ్చినట్లుంది. పరిచయ మందహాసం చేశాను. లోపలికి వెళ్ళిపోయింది.

" ఇంత కటువుగా ప్రవర్తించడానికి నేను ఆశించింది ఏమంత పెద్ద కోరిక ! " అన్నది - స్పూన్‌తో ఐస్‌క్రీమును గుచ్చుతూ.

నేను మాట్లాడలేదు.

"చెప్పు రాజూ" అంది మళ్లీ. తలెత్తి ఆమెకేసి చూసి తల వంచుకున్నాను. నాలో రేగిన భావాలను ఐస్‌క్రీమ్‌తో కలిపి దిగమింగేస్తూ " అయాం సారీ " అన్నాను.

క్షణం ఆగి అన్నది. " నేను పొద్దుతిరుగుడు పువ్వులాంటి దాన్ని రాజూ. నానుంచీ పారిపోతున్నావు గానీ, నా చూపు ఎప్పుడూ నిన్ను అంటే వుంటుంది. "

నాకు వాతావరణం ఇరుగ్గా తోచింది !

" జస్ట్ వన్ మినిట్ " అంటూ చివాలున ఇంట్లోకి వెళ్ళింది రజని. వీణ తీసుకువచ్చింది.

దోరగా నవ్వుతూ నా ఎదురుగా కూర్చుంది. చీర సర్దుకుంది. అంత త్వరగా వాతావరణాన్ని ఆహ్లాదం చేయటానికి పూనుకోవడమే రజని విశిష్టత అనిపించింది. సంగీత స్రోతస్విని సాగింది.

ఆమె వీణ వాయించడం ఎప్పుడు ఆపిందో గమనించలేదు. నేను. నా పక్కగా కుర్చీలో కూర్చుంది. కూనిరాగం తీస్తూ నా చేతిని తన చేతిలోకి తీసుకుని, నా చూపుల్లో చూపులు కలిపి అన్నది – "ఈ ఎడారిలో ఒయాసిస్‌వి నువ్వు. అంతే నేను చెప్పగలిగింది" అని నవ్వింది. స్త్రీ పురుషుల మధ్య మైత్రికి అవకాశం వుంది - వుందని సంబరంతో నా మనస్సు చిందులు వేసింది.

ఎర్ర జరీఅంచు తెల్ల చీరలో ఆమె అందాన్ని చూసి మురిసిపోతున్నాను నేను.

క్షణాల తర్వాత ఆమె నా చూపుల్ని పసిగట్టింది. "సిల్లీ" అంది గలగలా నవ్వుతూ.

నేను లేచి; మా ప్రయాణం సంగతి మామీకి కుకూడా చెప్పి సెలవు తీసుకుని వచ్చేశాను.

తీరా యింటికి వచ్చిన తర్వాత – మనస్సు పొరల్లో ఏదో సన్నని బాధ మొదలైంది. రజనితో ఏమేమో మాట్లాడివుంటే బాగుండేదనిపించింది. అవ్యక్తమైన వ్యధ మొదలైంది.

మర్నాడు –

రైల్వేస్టేషన్‌లో -

చేతిలో పాకెట్‌తో ప్లాట్‌ఫారమ్ మీదికొచ్చింది రజని. శారద చేతిని తన చేతిలోకి తీసుకుంది. ఆప్యాయంగా ఆమెతో మాటలు కలిపింది. ఇద్దరూ పక్కకి వెళ్ళి మాట్లాడుకోసాగేరు. నేను ఇతర మిత్రులతో సంభాషిస్తున్నాను.

క్షణాల తర్వాత, తమ దగ్గరికి పిల్చింది రజని. వెళ్లాను. "ఇది మీ ఇద్దరికీ" అంటూ పాకెట్‌ని అందజేసింది. థాంక్స్ చెప్పాను.

ఆ బహూమతి ఏమైవుంటుందా అనే ఉత్సుకత కలిగింది.

రైలు కదిలింది. అందరూ చేతులు వూపుతూ వీడ్కోలు చెప్తున్నారు. అంతమందికీ మధ్యగా - రజని ! రుమాలుతో కళ్ళు వత్తుకుంటూ నిలబడింది. నేనూ చెయ్యి వూపేను.

రైలు వేగం పుంజుకుంది.

సామాను సర్దుకొని సీట్లల్లో కూర్చున్నాం నేనూ శారదా.

చీకటిని చీల్చుకుంటూ సాగిపోతోంది రైలు.

మరికొంతసేపటికి - రజని ఇచ్చిన పాకెట్ విప్పి చూసేము. రెండు బిల్లార్ అద్దాలు, వాటి మధ్యగా ఫుల్‌సైజు ఫోటో. దానిలో నేనూ, శారదా, రజనీ - ఒకరి పక్కగా మరొకరం. సాగర్‌కి వెళ్ళినప్పుడు మమ్మల్ని ముగ్గుర్నీ నిలబెట్టి ప్రభాకర్ తీసిన స్నాప్ అది ! ఎన్‌లార్జ్ చేయించిందన్నమాట.

రజని బహుమతికి ముగ్ధుణ్ణయ్యేను.

పాకెట్‌ని తిరిగి కట్టేస్తూ అన్నది శారద - "ఆమెకి మీరంటే ఎంత ఆరాధనా, అభిమానమో, మాట్లాడుతుంటే కళ్ళలో నీళ్ళు తిరిగుతున్నై. పాపం. మీరు ట్రాన్స్‌ఫర్ కావడం పెద్దషాకే."

శారదకేసి పరీక్షగా చూసేను. ఏ భావమూ లేదు ఆమె మొహంలో. చాలా మామూలుగా అన్నట్టు వున్నది.

నాకుమాత్రం మనస్సు చివుక్కుమన్నది. శారద ఆలోచన ఏమిటా అనే సందేహం కలిగింది. మా ఇద్దరి గురించి తానే అభిప్రాయం ఏర్పరచుకున్నదో అనే అనుమానమూ వచ్చింది.

మౌనంగా కూర్చున్నాను.

—'నీకు వొక్క సూటు కూడా లేకపోవడమేమిటి ! నేను కుట్టిస్తాను వేసుకో చక్కగా బొద్దుగా ముద్దు పాపాయిలా వుంటావు.'

—'సిగరెట్ కాల్చని మగవాడంటే భలే కోపం. అలాంటి చిన్న చిన్న సరదాలు వుండాలి. వెన్నెల రాత్రి శ్రీఖండ్ తిని, కిళ్ళీ వేసుకుని సిగరెట్ కాలుస్తూ డాబామీద కూర్చుని కబుర్లు చెప్పుకోవడమో, వీణ వినడమో చేస్తుంటే 'థ్రిల్'గా వుండదూ !'

ఎప్పుడో రజని అన్న మాటలు గుర్తుకొచ్చినై నాకు. నేను ఆమె కోరికల్ని ఏనాడూ ఆమోదపరచలేదు.

శారద మాటలూ గుర్తుకొచ్చినై. 'పాపం మీరు ట్రాన్స్‌ఫర్ కావడం ఆమెకి పెద్ద షాకే.'

"నిజమా ?" అనే ప్రశ్న నాముందు నిలిచింది. ఏవీ అర్థంకాలేదు.

- పదిరోజుల తర్వాత !

రజని నుంచి వుత్తరం వచ్చింది. కోరి బదిలీ చేయించుకున్నందుకు మళ్ళీ నిష్ఠూరంతో మొదలెట్టి ఏమేమో రాసింది. మధ్యలో అన్నది. "మనం చేసే అన్ని చర్యలకి ప్రతిచర్యలు వుంటాయని గానీ, ఉండాలని గానీ అనుకోవడం తప్పని అర్థం చేసుకున్నాను రాజూ. అలాగే, నేను స్పందించినట్లు నీవు స్పందించాలని ఆశించడం కూడా సబబు కాదేమో మరి. అందుకనే నన్ను నన్నుగా మిగిల్చి నువ్వు వెళ్ళిపోయావు. అవును కదూ ?"

శారదకు ఉత్తరాన్ని చూపించాను. చదివింది. పరీక్షగా నా కళ్ళలోకి చూసింది. "ఉత్తరాల్లో ఇంతకంటే ఏం రాసుకుంటాలెండి" అన్నది.

నేను స్థాణువడిపోయాను. మనస్సు వికలమైపోయింది. నామాట నాకు అప్పజెప్పిందనిపించింది. అవును, ఎనిమిదేళ్ళ క్రితం శారదకూ ఇలాంటి వుత్తరమే వచ్చింది. ఆమె బావ వ్రాశాడు. చదవమని నా కిచ్చింది. చదివి నేనన్నమాట ఇదే మరి !

టిగర్ కవితలో మొదటి పాదం చప్పున స్ఫురించింది. "బే ఖైఫ్ దిల్ హై ఔర్ జియే జ్యాహాం" ఆనందం లేకున్నా జీవిస్తున్నానంటాడు.

ప్రేమ కథల ముగింపులన్నీ ఇంతే కాబోలు ! !

$0^0 0$